

# “సైకిలు సరదా”

బులుసు వేంకటేశ్వర్లు

పూర్వము సైకిళ్లు రాకపూర్వము బళ్లమీద పడవలమీద—ఇవి లేనిచోట రెంకుకాళ్ల బండి మీద పోతూండేవారము మాయూరు అసలే పల్లెటూరు. ఏప్రక్కను చూచినా 15, 20 మైళ్ళు వెడితేనేగాని రోడ్లుకాని రస్తాలుగాని లేవు. చుట్టాలింటికి పక్కాలింటికి సాధారణంగా నడిచి వెళ్లేవారము. లేకపోతే యే రెండు రూపాయలో తగలేసి రెండెడ్ల బండి యెక్కి తిళ్ళు లేక తిప్పలు లేక చచ్చి పది మైళ్ళుంటే ఒక రోజులోను ఇంకా పైనుంటే రెండురోజుల్లోనూ చుట్టాలింటికి తప్పనిసరయితే వెళ్లేవారము. మళ్లీ రావడ మోగండము రెండు రూపాయలు ఖర్చుపెట్టేముగనుక వారం పదిరోజులుండి తిని మరోయింటికి నడిచి వెళ్లేవాళ్ళము. ఆ రోజుల్లో బండెక్కడమే గొప్పగా వుండేది.

క్రమక్రమంగా రోడ్లు వేయించడము మొదలుపెట్టేరు. రైలుమార్గాలుకూడా వచ్చినాయి. సైకిళ్ళప్పుడే మితిమీరినయి. ఏమూల చూచిన కుక్కలకంటె నక్కలకంటె ఎక్కువగా వున్నాయి.




మొదట మావూరుకు సైకిలు తెచ్చిన వాడు సింగవరపు రంగారావుగారు. కొంచెము పెద్ద ఆస్తిపరుడు. మొన్నమొన్నటిదాక రంగయ్య అని పిలచేవాళ్లము కాని ఆయన సైకిలు తెచ్చిన తరువాత, క్రాపింగుపెట్టించిన తర్వాత ఆయన అజ్ఞానుసారము రంగారావుగారని పిలవటమలవాటయినది. ఈయనకు “సరదా సైకిలు రంగిగా” డని కొంటెగాండ్రు పేరెట్టారు. సైకిలు సరదా కథ చెపుతున్నా వినండి.

ఒకనాటి మధ్యాహ్నానికి రంగారావుగారూరినుంచి వస్తున్నారనియు ఐదుగురు బంట్రోతుల బంపమన్నారనియు కబురు వచ్చింది. ఎందుకో, ఏమి సామాను తెచ్చారో యని తహ తహాతో పంపించేరు. మధ్యాహ్నము పండ్రెండు గంటలకు రంగారావుగారు ముందు నడుస్తూంటే సైకిలు నెత్తుకొని ఐదుగురుకూలీలు వచ్చు

చున్నారు. ఒకకూలీ నెత్తిమీద పెట్టుకొన్నాడు సైకిలు. మిగిలిన నలుగురు నాలుగుప్రక్కలా సైకిలు గట్టిగా పట్టుకొని నింపాదిగా అడుగులో అడుగు వేసుకొంటూ వస్తూయున్నారు

ఈలోపుగా మనయూరు సైకిలొస్తోందని ఐదారుతీర్థాల ప్రజలు పోగడ్డారు. సైకిలుమాట విని భోంచేస్తున్నవారు చెయ్యికడుక్కోకుండ కొందరు, విరబోసుకొన్న జుట్టుతో కొందరు, బట్టకట్టుకొంటూ కొందరూ, చేతులు తుడుచుకొంటూ కొందరు, స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు అందరు రంగారావుగారింటివద్ద ప్రత్యక్షమయ్యారు.




కూలీలు సైకిలు దింపేరు. దానిని ముట్టుకుంటే యేంచేస్తుందో యని పాపము చాల దూరాన్ని నిలబడ్డారు కూలీలు, రంగారావు తప్ప మిగిలిన జనమంతా! "ఛీ! ఛీ! యీ సైకిలు యినుముతో చేసినది కాదటోయి. ఇనుపగజ్జెలతల్లి నింటికి దెచ్చినాడేమోయి" అని కొందరు. "ఆహా! ఈ సైకిలు ఏ ఇంగ్లాండులో తయారుచేసినారో! ఏమి దాని నైపుణ్యము" అని కొందరు నానారకాలుగాను ఉన్నారాజనం.

అప్పుడు సైకిలు గదిలో పెట్టి తాళము వేసేరు. రంగారావుగారానంద నిమగ్నుడై భోంచేసి నిమ్మదించినమీదట 2 గంటలకు నేర్చుకుందామని ఇంకోకూలీని అదనంగా పెట్టి నేర్చుగోటం ప్రారంభించేరు. కూలీలు ఆరుగురు సైకిలు గట్టిగా పట్టుకొన్నారు పుస్తకములో వ్రాసిన ప్రకారం సైకిలు సీట్ మీద కెక్కి ఒకడిభుజం గట్టిగా పట్టుకొని నడిపించుమన్నాడు. నడుస్తూంటే Handle Bar (హేండిలు బార్) త్రిప్పుమని వుంది కాబోలు! అసలే గుండెలో దడపట్టుకుంది రంగారావుగారికి దానితో భయమధికమయినది. రంగారావుగారు Handle Bar ప్రక్కకు తిప్పేడు. ఒక కూలివానిమీదకు తిరిగింది. దానితో వాడు భయపడి "ఓరి బాబోయి! దెయ్యంరో" యని ప్రక్కకు పరుగెత్తేడు. మిగిలినవారు దానితో జడిసికొని సైకిలు విడిచి పెట్టేరు

అందులోనేవుంది గమత్తంతా. రంగారావుగారు క్రిందపడ్డారు, సైకిలు మీద పడింది చక్రములు తగులుటచే కూలీలు సైకిలుమీద పడ్డారు. నలుగురు "ఘొల్లు"మన్నారు. ఇంతలో నలుగురు చేరి వారిని లేవదీసేరు. రంగారావుగారి

యాజ్ఞప్రకారము సైకిలు మళ్ళీ గదిలో పెట్టి Lock-up చేసేరు. ఆరోజుకు విరమించేరు. 2, 3 రోజులుదాకా మూసినకన్ను తెరవలేదు రంగారావుగారు.

ఇంకేముంది భార్య సణుగులు తిట్లు. ఏంచేస్తాడు రంగారావు. పాపము నోరు మూసికొని పడుకొన్నాడు.

చివరకు ఒక సంవత్సరంలో తనంతట తాను త్రొక్కడం నేర్చుకున్నారు. ఆయనతర్వాత ఆయన కుమారుడు వెంకట్రావుగారు తాను తండ్రికంటె నాలుగునెలలు తక్కువలోనె అనగా ఎనిమిదినెలలోనే నేర్చుగున్నానని నలుగురితోటి అస్తమానం చెప్పడమే

అల్లాంటిసైకిళ్ళు ఎక్కడ పడితే అక్కడే కొల్లలు కొల్లలు. కుక్కలు నక్కలు చాలవు. కాల వైచిత్ర్యము !

---

# "వి నో ది ని"

## (న వ్య ల స చి త్ర మా స ప త్రి క)

సం॥ చందా రు. 1—0—0 విదేశములకైనచో సం॥ చందా రు. 2—0—0

విడిప్రతి అ. 0—2—0 విదేశములకు అ. 0—3—0

చందాపైకమును చెల్లించిననెలనుండి వెల్వాడు పత్రికలే చందాదారులకు పంపబడును.

(1) చందా పైకమును మనియార్డరుద్వారా ముందుగనే పంపవలయును. విదేశములందుండువారైనచో తమ చందా పైకమును మనియార్డరుద్వారాగాని లేక బ్రిటిషు తపాలాఆర్డరుద్వారాగాని పంపవలెను.

(2) చందాదారుల విలాసము మారినచో నట్టి విషయమును మఱుసటిసంచిక వెల్వాడులోపల మాకు తెలియజేయవలయును. అట్లు తెలుపనిచో పత్రిక మామూలు విలాసముననే పంపబడును. మరల పత్రిక పంపవలెనని కోరునెడల దాని ఖరీదును పంపినయెడలగాని పంపజాలము. ప్రత్యుత్తరము గోరువారు తపాలాచార్జీనిగూడ తమ జాబుతో పంపవలెను.